

# అమెరి "కలగూరగంప" కామెడి
## వంగూరి చిట్టెన్‌రాజు



## మట్టి కుండీలో కుండీలో మట్టి ....

**9**

**ఇంతకు ముందు నేను గడ్డి పీకుడు** మీద రాసిన కథకి అనేక దేశాలనుంచి ఆయా దేశాలలో దొరుకు గడ్డీ గాదముల గురించి, వాటిని పీకే ఆధునిక టెక్నాలజీ గురించి కొంతమంది పాఠకులు వివరాలు పంపించారు...ఫొటోలతో సహా! నేను కొంచెం నిరాశపడిన మాట నిజమే. ఎందుకంటే వాటిల్లో ఎక్కడా ఆయా దేశాల తాలూకు సుందరాంగులు గడ్డి పీకుడు దృశ్యాలు లేవు మరి. అమ్మయ్య, ఇన్నాళ్ళకి నేను రాసిన ఒకానొక టాపిక్ చాలామందికి నచ్చి, నాకు అచ్చొచ్చిందేమో అనుకున్నాను. హాయిగా నా సొంత లాపుటాపు నా సొంత ల్యాపుల మీద...అనగా తొడలమీదే పెట్టుకుని, సోఫాలో కూచుని, ఈసారి కూడా గడ్డి మీదే రాద్దామా అని ఆలోచిస్తున్నాను. ఇల్లంతా అతి నిశ్శబ్దంగా ఉంటే హడిలి చస్తానేనోమో అని భయం వేసి కేవలం సౌండు కోసం చచ్చు వార్తలు వచ్చే టీవీ పెట్టేసుకున్నాను.

సరిగ్గా ఆ సమయంలో మా వీధి తలుపు ఠపీమని తెరుచుకుంది. అమెరికాలో వీధి బెల్లు మోగితే మన ప్రాణాలకి ఎవడో అమ్మకం వాడు వచ్చినట్టూ, ఠపీమని తలుపు తెరుచుకుంటే మన వాళ్ళే మన ప్రాణాలకి ఇంటికి వచ్చేసినట్టు లెక్క. అనుకున్నట్టుగానే "వెధవ, యూస్ లెస్ ఫెలో, దగుల్బాజీ" అనుకుంటూ పాతకాలం తిట్లు తిడుతూ మా క్వీన్ విక్టోరియా చేతిలో సంచులతో సహా రంగప్రవేశం చేసింది. ఇంక ఇంట్లో నిశ్శబ్ద భయం తగ్గడానికి వేరే సౌండు అక్కర లేదు కదా అని వెంఠనే టీవీ కట్టేశాను. పైగా ఆవిడ తిడుతున్న ఆ వెధవ అన్న మాట నా గురించి అన్నది కాదు అని నాకు స్పష్టంగా తెలిసిపోయింది. ఎందుకంటే ఎవరైనా మనల్ని చూస్తూ...అనగా విక్టోరియా మహారాణి భవదీయుణ్ణి తీవ్రంగా వీక్షిస్తూ వెధవా అని దీర్ఘం తీసిన యడల అది నాకు అన్వయించుననియూ, "వెధవ" అని మామూలుగా, పొట్టిగా, పొడి, పొడిగా మాత్రమే అనినచో అది ఇతరులను కించపరుచుటకూ వాడిన మాట కదా...అందుకూ..

అందువలన "ఎవడా వెధవ? ఏమా కథ?" అని ధైర్యంగా ప్రశ్నించాను.

"అంతా నీ మూలాన్నే, వెధవ కథ, వెధవ గడ్డీ, వెధవ పీకుడూ, నువ్వూనూ" అని హేట్రిక్ కొట్టింది మహాతల్లి.

"వావ్, ఇందులో ఏదో నా స్వయంకృతాపరాధం ఉంది సుమా అనిపించి, ఏమీ తెలియనట్టుగా, ఏమీ విననట్టుగా నటించేస్తూ నా ల్యాపుటాపుని చితగ్గొటేశాను. ఇటువంటి సమయాల్లో, అనగా మనకి కోపం వచ్చినా, నిస్సహాయత చోటు చేసుకున్నా, అర్థాంగి డైలాగులు అర్థం అవని అవస్థలో పడినా, అందుబాటులో ఉన్న ఏదో ఒక జడ పదార్థాన్ని చితగ్గొట్టికానీ, కనీసం ఎడాపెడా చెంపలు వాయించుకొని

మన మానసికావస్థకి "రిలీఫ్" కలిగించుకోవాలని శాస్త్రం చెపుతోంది కదా! అందువలన నా ముఖారవిందానికి ప్రధాన కారణాలయిన చిరు చెంపలని చెప్పుదెబ్బలు కొట్టే బదులు, జడపదార్థానికి ప్రతిపదార్థమయిన ల్యాపు టాపుని చితగ్గొట్టే పనిలో నేను నిమగ్నమయి ఉండగా మళ్ళీ ఉరుములూ, మెరుపులతో ఆకాశం మేఘావృతమయింది.

"నేను ఇలా అరుస్తూ ఉంటే, వెధవ కంప్యూటర్ చూసుకుంటావేం?" అని ఉరుముల తాత్పర్యం.

అలాటి వర్షం వచ్చినప్పుడు ఎక్కడో చెట్టు కిందకి "చిట పట చినుకులు పడుతూ ఉంటే, చెలికాడే సరసన ఉండే" అవకాశం లేదు కాబట్టి, ఒక్కణ్ణే అర్జంటుగా మా తోటలోకే పరిగెట్టాను. ఎందుకయినా మంచిదని తోటలోనే కనపడకుండా దాక్కునే మా కారు గరాజ్ వెనక్కీ, ఇంటి గోడ పక్కకీ కూడా పరిగెట్టాను. అప్పుడు అవన్నీ మళ్ళీ కనపడ్డాయి. అదొక మహారణ్యం.

మొదటేమో, బీ.పా. విత్తనాలు వేసిన నాలుగు వారాలలోనే ఇది అరి వీర భయంకరంగా పెరిగి, ఆఖరికి మా ఇంటి పైకి, పక్కింటి వాడి స్విమ్మింగ్ పూల్‌లోకీ పాకి పోయి నాలుగు నెలలు అయినా కొన్ని వందల పసుపు రంగు పూలు చూడ్డానికి ముచ్చటగానే ఉన్నా ఇప్పటి దాకా ఒక్క బీరకాయ కూడా కాసి చావ లేదు. పైగా మా పక్కింటి వాడి లాయర్ నుంచి రెండు సార్లు నోటీసులు వచ్చాయి. అంచేత వారానికోసారి పక్కింటిపిల్ల ఈత కొట్టుకొట్టుకుంటూ ఉంటే, నేను స్విమ్మింగ్ పూల్‌లో బీర పూవులు శుభ్రం చేసే పని పడింది. ఇది చూసి, మా క్వీన్ విక్టోరియా అపార్థం చేసుకుని, తెల్ల పిల్ల ఈత కొట్టే సమయంలో నేను అటు వేపు వెళ్ళకుండా ఆంక్షలు విధించింది.

ఇంకా ఒళ్ళు మండే విషయం ఏమిటంటే, నేను రోజూ కళ్ళు విశాలం చేసుకుని అంగుళం, అంగుళం వెదికినా, చేతులతో తడిమినా ఎక్కడా కనపడని, ఒకానొక బీరకాయ, హఠాత్తుగా ఒక రోజున బాగా ముదురి పోయి విత్తనాల కాయగా మారిపోయి నన్ను వెక్కిరించుట. లేతగా ఉన్నప్పుడు కనపడి చావక, పూర్తిగా ముదిరిపోయి గోధుమ రంగులోకి మారిపోయిన బీరకాయ ఇన్నాళ్ళు మనకి కనపడకుండా ఎలా దాక్కుంటూందీ అనేది ప్రపంచంలో నాకు అర్థమవ్వని వింతల్లో ఒకటి. పైగా ఈ ముదిరిపోయిన సదరు బీరకాయ ఆరు అంగుళాల మాత్రమే పొడుగు ఉండే పొట్టి బీర తాలూకా, లేక రెండు అడుగుల దాకా సాగే పొడుగు బీరకాయా అనేది కూడా నాకు అర్థం అవని మరొక విషయం.

ఆ బీ.పా పక్కనే, ఈ వేసంగిలో బుద్ధి పొరపాటున దొం.పా వేశాను. దీని పూర్వీకులు మా కాకినాడ వారే. ముప్పై ఏళ్ళ క్రితం ఒక చిన్న వేళ్ళున్న పాదుని నడుం చుట్టూ వడ్డాణంలా కట్టుకుని "స్మగ్లింగ్" చెయ్యబడి అమెరికా ప్రవేశం చేసిన బాపతన్నమాట. అప్పుడు కొన్నాళ్ళు బాగానే ఉంది కానీ, తరవాత ఈ అమెరికాలో స్థానిక రకం పాదులతో ఎక్కడ పర పరాగ సంపర్కం చెందిందో తెలియదు కానీ, ఇప్పుడు అది పిచ్చి దొండలా మారిపోయింది. అంటే, ఈ దొం.పాని ఎన్ని మందులు వేసినా, ఎన్ని సార్లు పీకినా, చచ్చినా చావదు. మళ్ళీ, మళ్ళీ విజృంభించి బీ.పాతో కలిసి మెలిసి అమెరికా అంతటా పాకేసింది. అంటే, మా పక్కింటి పిన్నిగారు పబ్లిగ్గా స్నానం చేసే అతి పెద్ద నీళ్ళ కుండీతో సహా.

కుండీ అంటే గుర్తొచ్చింది. అమెరికాలో మనల్ని కన్‌ఫ్యూజ్ చెయ్యడానికి ఈ మొక్కల వ్యాపారస్తులు మరొక టెక్నాలజీ వాడతారు. ఉదాహరణకి కొన్ని మొక్కలు గేలన్‌ల లెక్కలో అమ్ముతారు. అంటే, మొక్క పాతిన కుండీ సైజ్ అనమాట. అర గేలన్ మొక్క అంటే చిన్న మొక్క అనీ, పది గేలన్ల మొక్క అంటే పెద్ద మొక్క అనీ మనం అనుకోవాలన్నమాట. ఏదో కొంచెం తేడా తప్ప, నిజానికి ఇవన్నీ ఒకే సైజు మొక్కలే. అదో రకం మోసమే! కుండీ సైజు పెద్దది కాబట్టి, మట్టి ఎక్కువ వేస్తారు, అంతే. మనం మట్టి కొనుక్కుంటున్నామో, మొక్క కొనుక్కుంటున్నామో తెలిసి చావదు. దీన్నే మరొక రకంగా అంగుళం కుండీ అనీ, ఆరంగుళాల పాట్ అనీ పేరు పెడతారు. ఈ టెక్నాలజీ తాత్పర్యం కూడా అదే పోనీ, విత్తనాలు కొనుక్కుందామంటే, ఆరు విత్తనాలు ఆరు డాలర్లు. ఆరు

విత్తనాలు పట్టే చిన్న పేకెట్ మటుకు సర్వాంగ సుందరంగా ఉంటుంది. ఆ పేకెట్ జాగ్రత్తగా బంగారం పేకెట్‌లా విప్పకపోతే, ఆరు విత్తనాలూ ఎక్కడో పడిపోతాయి. ఆరు డాలర్లూ గోవిందా, ఆరు విత్తనాలూ గోహో గోవిందా!

ఆ మాట కొస్తే అమెరికాలో ఎలాంటి పువ్వు కొనుక్కున్నా చూచుటకు బావుండును కానీ, సువాసన బొత్తిగా ఉండదు. సువాసన కూడా కావాలంటే గులాబీలకి కూడా గులాబీ అత్తరు పరిమళం కొని వాటి మీద చల్లాల్సిందే. మల్లె పూలు, బంతి పూలు అసలు ఏవైనా సరే, ఇదే పద్ధతి.

బంతి పువ్వులంటే జ్ఞాపకం వచ్చింది. ఏమిటో తెలియదు కానీ, అసలు పువ్వుల మొక్కలకి నేనంటే బొత్తిగా పడదని అది గుర్తొచ్చినప్పుడల్లా నామీద నాకే అనుమానం వచ్చేస్తుంది. ఉదాహరణకి, మొన్ననే ఒక పూల మొక్కలు అమ్మే నర్సరీ కొట్టుకి వెళ్ళినప్పుడు, ఒక ట్రేలో ఉన్న తొమ్మిది చిన్న, చిన్న బంతి మొక్కలు తొమ్మిది డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లు సేల్‌లో పెట్టాడు. మామూలుగా అయితే అది పంతొమ్మిది డాలర్ల తొంభై తొమ్మిది సెంట్లుట. దాన్నే "అమెరికాలో చెవిలో పువ్వు పెట్టుట" అంటారు. అంటే నిజానికి వాటి ఖరీదు ఎప్పుడూ అంత ఎక్కువ ఉండదు. ఏదో అలా పెద్ద అక్షరాలతో రాస్తారంతే!. "దసరా పండుగ సందర్భంగా గొప్ప తగ్గింపు ధర"కే మీకు పూర్తిగా, మీకు సంతృప్తికరంగా గుండు గీయబడును అని మా ప్రొ. వీర్రాజు బార్బర్ షాప్ ఆడుకునే ఆటే ఈ అమెరికా "సేల్" ఆట.

బంతి పువ్వులు బావుంటాయి అని తెలుగు కవులు ఎడా పెడా పద్యాలు రాశేశారు కాబట్టి, నేను కూడా బాగా ప్రతీ మొక్కా చూసి, చూసి, ప్రతీ పువ్వుకీ ఎన్ని రేకలు ఉన్నాయో లెక్కపెట్టుకుని, అత్యధిక రేకలు ఉన్న రెండు ట్రేల బంతి మొక్కలు..అనగా పద్దెనిమిది మొక్కలు కొనుక్కొచ్చాను.

ఎందుకో తెలియదు కానీ అక్కడ అత్యంత సుందరంగా, సొగసులూరిన బంతి మొక్కలు, నేను ఇలా మా తోటలోకి పట్టుకొచ్చిన సరిగ్గా అరగంటకే మొహం వేళ్ళాడేశాయి. "ఓహో, పాపం చిన్న కుండీలో బతకలేక పోతున్నాయి కామోసు" అనుకుని, నేను వాటిని వెంఠనే పెద్ద కుండీలో వేశాను. ఒక రోజు పోయాక, వాటి మొహాలు ఇంకా పరిపరి విధాలుగా మాడి పోయి ఆఖరికి చచ్చి ఊరుకున్నాయి.

ఎక్కడో, ఏదో తేడా ఉంది అనిపించి, మళ్ళీ పట్టు వదలని విక్రమార్కుడిలా ఇంకో నర్సరీకి వెళ్ళి, ఈసారి చేమంతులు, చిట్టి చేమంతులూ పట్టుకొచ్చాను. బంతి మొక్కల సంగతి వీటికెలా తెలిసిందో కానీ, ఇప్పుడూ అదే సీను. మా ఇంటికి రాగానే మొహం వేళ్ళాడుట, నేను వాటిని జాగ్రత్తగా చిన్న కుండీలోంచి పీకి పెద్ద కుండీలలో వేయుట, ఒకరోజు దాటగానే ఠపీమని వాటి ప్రాణం పోవుట.

మరొకసారి ఒక చోట అమెరికనకాంబరాలు దొరికాయి. ఇవి అపురూపం కాబట్టి సేలూ లేదు, గీలూ లేదు. అంగుళం మొక్క ఆరు డాలర్లు పెట్టి ఆరు మొక్కలు కొన్నాను. ఈసారి నా సొంత టెక్నాలజీ వాడాను. అదేమిటంటే, కొట్టులో కొన్న మొక్కలని వేరుతో పెకిలించేసి పెద్ద కుండీలలో వేస్తే చస్తున్నాయి కాబట్టి, యధాతథంగా వాటిని పెద్ద కుండీలో పాతెయ్యడం అన్నమాట. అంటే, అంగుళం కుండీని ఆరంగుళాల కుండీలో పెట్టేసి, చుట్టూ మట్టి పోసేశాను. అనగా, మొక్కని మా ఇంటికి తీసుకొచ్చినట్టు తెలియకుండా తను ఇంకా నర్సరీలోనే ఉన్నాను సుమా అనే ఫీలింగుతో ఉంటుంది అనమాట. అప్పుడైనా కొన్నాళ్ళు బతికి బట్టకడుతుంది కదా అది నా బ్రిలియంట్ ఐడియా.

అలా కుండీలో మట్టిలో మళ్ళీ కుండీ పెట్టేసి, ఈసారి పక్కనే ఉన్న నేను రోజా మొక్కలకి నీళ్ళు పోసే ప్లాస్టిక్ జారీతో ప్రేమగా, సినిమాలో సావిత్రిలాగా, నర్గీస్ లాగా షోగ్గా కొన్ని గేలన్ల నీళ్ళు పోశాను. ఈ రోజుల్లో హీరోయిన్లు అందరూ ఎంత సేపూ మలేషియాయో, ఆస్ట్రేలియాయో పారిపోయి జలపాతాలలో నీళ్ళోసుకోవడమే కానీ, సొగసుగా ఎవరూ మొక్కలకి నీళ్ళు పొయ్యడం

నేను చూడ లేదు. అందు చేత ఈనాటి నాయికలు ఎంత సొగసుగా మొక్కలకి నీళ్ళెలా పోస్తారో తెలియక సావిత్రినీ, నర్గీస్‌ని ఎన్నుకున్నానమాట.

కానీ, నా అంచనాలన్నీ మళ్ళీ తారుమారయ్యాయి. ఆ మర్నాడు పొద్దున్నే అమెరికనకంబరాలని పలకరిద్దామని తోటలోకి వెళ్ళి చూద్దును కదా....అవన్నీ మాడిపోయి, నాకేసి ఆఖరి చూపులు చూస్తున్నాయి.

"ఇదిగో, చూశావా, ఇవి కూడా బంతులూ, చేమంతులలాగ రంభా, ఊర్వశులకి సింగారం కోసం స్వర్గానికి వెళ్ళిపోయాయి" అని మా ఆవిడతో మొరపెట్టుకున్నాను.

ఇది విని, ఏదీ నీ బొటన వేలు చూపించు" అని రిక్వస్ట్ చేసింది మా క్వీన్ విక్టోరియా. మొక్కలు చచ్చుటకూ, నా వేళ్ళకీ సంబంధం అంతుపట్టక, ఆవిడ కోరిక తీర్చే అవకాశం మరొకసారి వచ్చింది కదా అని, ఎందుకయినా మంచిదని నా రెండు చేతి బొటన వేళ్ళూ, ఇంకా ఇంప్రెస్ చెయ్యడానికి కాలి వేళ్ళూ కూడా చూపించాను.

"అవును మరి, అందుకే పువ్వుల మొక్కలు చావక చస్తాయా?" అనే మా క్వీన్ విక్టోరియా సాధింపు నన్ను ఇంకా రెచ్చగొట్టింది.

"ఏమిటి ప్రేయసీ, నా బొటన వేళ్ళకీ, పువ్వుల మొక్కలు చచ్చుటకీ ఉన్న సంబంధం వివరింపుము" అని అడిగాను.

"ఇదిగో, చూసుకో, నీది బ్రౌన్ థంబ్"...అనగా నీకూ, మొక్కలకీ పడదు. నువ్వు ముట్టుకుంటే మటాష్..కావాలంటే నా బొటన వేలు చూడు" అని నేను అడక్కుండానే తన బొటన వేళ్ళు చూపించింది క్వీన్ విక్టోరియా.

"అరే, అదేమిటీ, నీ వేళ్ళు అలా ఆకుపచ్చగా ఉన్నాయి?" అని ఆశ్చర్యపోయాను.

"అదేనోయ్, వెర్రి మొహమా..నాది గ్రీన్ థంబ్...అంటే నా చెయ్యి తగిలితే మొక్కలు ఆనందించును. నీదేమో బ్రౌన్ థంబ్..అనగా నువ్వు ముట్టుకుంటే అన్ని మొక్కలూ చచ్చును...ఒక్క గడ్డి మొక్కలు తప్ప. అందుకే నువ్వు కథలు రాసుకో, నేను మొక్కలు పెంచుతాను" అంది మహారాణి అంటూ తన వేళ్ళు ప్రేమగా చూసుకుంటూ.

"నీ మొహం, నాదేమో నేచురల్‌గా ఉండే గోధుమ రంగు. కానీ నీ వేళ్ళకి ఏదో ఆకుపచ్చ రంగు అంటుకుంది. అంతే" అన్నాను.

"అవుననుకో, ఇందాకా గడ్డిని సంపూర్తిగా చంపేసే మందు కొనుక్కొచ్చానుగా. అది నువ్వు నీళ్ళు పోసే జారీలో వేసేటప్పుడు, కాస్త చేతికి కూడా అంటుకున్నట్టుంది." అని చెయ్యి కడుక్కోడానికి వెళ్ళింది మా క్వీన్ విక్టోరియా.

వెంఠనే నా బుర్రలో ఏదో వెలిగి కెవ్వు అని అరిచాను.

"ఎందుకూ అరుపులూ?"..

"అదే, నువ్వు, ఆ గడ్డి చచ్చుడు మందు నేను రోజూ మొక్కలకి నీళ్ళు పోసే నీళ్ళ జాడీలో వేశావా?" అన్నాను పాలిపోయిన మొహంతో.

"అవునూ, ఏం? ఒక చెంచాడు మందుని ఒక గేలన్ నీళ్ళలో కలిపి రంగరించి ఎక్కడ గడ్డి మొక్క ఉన్న అక్కడ పోసిన యడల, అవి మటాష్ అని ఆ మెక్సికనుడు చెప్పాడుగా. వాటీజ్ యువర్ ప్రోబ్లెం? వెధవ, యూస్‌లెస్ ఫెలో దగుల్బాజీ, ఒక చెంచాడు మందుకీ పది చదరపు అడుగుల నేలలో ఉన్న అన్ని మొక్కలూ చస్తాయని ఘాటిగా చెప్పాడు. "అలా అయితే నాకు పది చెంచాలు చాలు" అని అడిగాను.

"నో మేడం. మినిమం ఒక అర గేలన్ మందు మాత్రమే అమ్ముతాం. మీ చిన్న తోటలో, నాలుగేళ్ళు వాడుకోవచ్చును. ఇవాళ సేల్‌లో ఉంది కూడానూ, జస్ట్ నైన్‌టీన్ డాలర్స్ అండ్ నైన్‌టీ నైన్ సెంట్స్... " అన్నాడు..

"అందుకే, ఎందుకయినా మంచిదని పాతిక చెంచాలు జాడీలో కలిపాను. కొంప తీసి నీళ్ళు కానీ పోశావా కనకాంబరాలకీ? నువ్వెప్పుడూ ఇంతే"..రుస రుసలాడింది క్వీన్ విక్టోరియా.